బోరు మరమ్మతు చేపట్టరూ..

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండల కేంద్రంలో కాలేజీ రోడ్డు చర్చి పక్కనున్న తాగునీటి బోరు సుమారు గత 6 నెలల నుంచి మరమ్మత్తుకు గురై నిరుపయోగంగా ఉంది. ఆ వీధిలో ఉన్న వారి సౌకర్యార్థం తాగునీటి బోరు నిర్మించారు. మరమ్మత్తుకు గురైనా ఇప్పటికీ అధికారులు చేపట్టడంలో చర్యలు తీసుకోకపోవడంతో ఆ బోరు ఎటువంటి ఉపయోగం లేకుండా నిరుపయోగంగా మూలన పడి ఉంది. దీంతో, ఆ వీధిలోని వారికి తాగునీటి సమస్య ఏర్పడింది. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా మరమ్మతుకు చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు తెలిపారు. తక్షణమే అధికారులు స్పందించి మరమ్మత్తు చేసి వినియోగంలో తీసుకువచ్చి తాగునీటి సమస్యను తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ట్రాఫిక్ సమస్యతో సతమతం

-సంతలో ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్ - భారీగా నిలిచిపోతున్న వాహనాలు

ప్రజాశక్తి- ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో నిత్యం ట్రాఫిక్ సమస్య వీడటం లేదు. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. శనివారం జరిగిన వారపు సంతలో రహదారికి ఇరువైపులా అడ్డంగా వాహనాల నిలుపుదల చేయడంతో మరింత ట్రాఫిక్ జఠిలమైంది. ఒరిస్సా, మైదాన ప్రాంతాల నుండి వచ్చే వ్యాపారుల వాహన రహదారులు ఎక్కడపడితే అక్కడ ఇష్టానుసారంగా, అడ్డదిడ్డంగా నిలిపి వేయడంతో వారపు సంత రోజున మరింత ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. దీంతో ప్రయాణికులు అవస్థలు పడడమే కాకుండా 108, 104 అత్యవసర వాహనాలు వెళ్లలేని దుస్థితి నెలకొంది. పాదచారుల సైతం రోడ్డు దాటలేని పరిస్థితి నెలకొంది. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రయాణికులు, పాదచారులు మండి పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సంతలో నిలిచిన ఆటోలు

కౌంటర్ వద్ద భారీగా అభ్యర్థులు

ఉచిత సివిల్స్ శిక్షణకు దరఖాస్తుల వెల్లువ

ప్రజాశక్తి-పాడేరు : సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ అధ్వర్యంలో గిరిజన యువతకు అందించనున్న ఉచిత సివిల్స్ శిక్షణకు దరఖాస్తులు వెల్లువెత్తాయి. 1843 మంది అభ్యర్థులు దరఖాస్తులు తీసుకున్నారు. సాయంత్రం 6 గంటలకు 1735 మంది దరఖాస్తుల సమర్పించారు.ఐటిడిఏ పిఒ వి. అభిషేక్ ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేసారు. ఈ నెల 7వ తేదీతో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసిందని స్పష్టం చేసారు. మొదటి దశ రాత పరీక్షకు ఈనెల 9వ తేదీ నుండి హాలు టికెట్లు జారీ చేస్తామన్నారు. 16న మధ్యాహ్నం చింతపల్లి యూత్ ట్రైనింగ్ సెంటర్, పాడేరు తలారిసింగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల, అరకువ్యాలీ యూత్ ట్రైనింగ్ సెంటర్ లోను ప్రిలిమినరీ (మొదటి దశ) రాత పరీక్ష నిర్వహిస్తామన్నారు. ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలను 18 తేదీన ప్రకటిస్తామని పేర్కొన్నారు. 19 వ తేదీన మెయిన్ పరీక్ష (రెండవ దశ)కు హాలు టికెట్లు జారీ చేస్తామని తెలియ జేసారు. 22 వ తేదీన పాడేరు తలారిసింగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో రెండవ దశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. 26న రెండవ దశ ఫలితాలు వెల్లడించి ఇంటర్వ్యూకు అర్హతలు సాధించిన అభ్యర్థులకు 27న ఇంటర్వ్యూలకు హాలు టికెట్లు జారీ చేస్తామన్నారు. ఈ నెల 30, 31 తేదీలలో ఐటిడిఏలో ఇంటర్వ్యూలు నిర్వహించి నవంబరు 1న తుది జాబితా వెల్లడించి 2వ తేదీ నుండి విశాఖపట్నం వేపగుంట యూత్ శిక్షణా కేంద్రంలో సివిల్స్ శిక్షణా తరగతులు ప్రారంభిస్తామని చెప్పారు.

ప్రజలతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కిరణ్

15న బహిరంగ సభను జయప్రదం చేయండి

- సిపిఎం జిల్లా కార్యదర్శి కిరణ్

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం మండల కేంద్రంలో ఈనెల 15వ తేదీన సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ పిలుపునిచ్చారు. శనివారం రంపచోడవరం మండలం మర్రివాడ గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రంపచోడవరం కేంద్రంగా ప్రత్యేక జిల్లాను ఏర్పాటు చేయాలని, పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలని, రంపచోడవరం నియోజకవర్గంలో ఉన్న పలు సమస్యలపైనా పోరాడేందుకు ఈ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు, మట్ల వాణిశ్రీ, గిరిజన సంఘం నాయకులు తీగల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్స్ యూనియన్

నేతల అరెస్టు అన్యాయం : సిఐటియు

ప్రజాశక్తి- అరకులోయ:గుంటూరు జిల్లా తాడేపల్లి లో ప్రభుత్వ ఒత్తిళ్లతో మృతి చెందిన కృపమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి, గుంటూరు జిల్లా కార్యదర్శి లక్ష్మి, ఆశా కార్యకర్తలు, సిఐటియు జిల్లా నాయకులను శుక్రవారం రాత్రి అరెస్టు చేసి తాడేపల్లి పోలీస్ స్టేషన్ లో నిర్బంధించడం దుర్మార్గపు చర్య అని సిఐటియు అల్లూరి జిల్లా కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బలవంతంగా వాహనాల్లో ఎత్తిపడేసి ఎక్కడికి తరలిస్తున్నారో చెప్పకుండా గుంటూరు వైపు తీసు కెల్లడం అన్యాయం అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం చనిపోయిన కృపమ్మ భౌతిక కాయాన్ని ఇంతవరకు కుటుంబ సభ్యులకు అందించలేదన్నారు. మృతదేహం ఎక్కడున్నదో కూడా కుటుంబ సభ్యులకు చెప్పలేదన్నారు . నిత్యం దళితుల గురించి మహిళల గురించి గొప్పలు చెప్పుకునే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఈ విధంగా వ్యవహిరంచడం సరికాదన్నారు.జగనన్న సురక్ష కార్యక్రమం పేరుతో ఆశా వర్కర్లకు నిద్రాహారాలు లేకుండా చేస్తున్నారని,దీని మూలంగానే చిత్తూరు జిల్లాలో జానకి అనే ఆశ వర్కర్ నాలుగు రోజుల క్రితం మృతి చెందిందని,ఇప్పుడు గుంటూరు జిల్లా తాడేపల్లి లో కృపమ్మ చనిపోయిందన్నారు. వీరి కుటుంబాలను ఆదుకోవాలన్నారు.ప్రభుత్వ దుర్మార్గ చర్యలను అన్ని కార్మిక సంఘాలు రాజకీయ పార్టీలు ఖండించాలని విజ్ఞప్తి చేశారు.చనిపోయిన ఆశ కార్యకర్తల కుటుంబాలకు 50 లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియో ప్రకటించాలని, కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం , ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అటవీశాఖ సిబ్బంది

వన్య ప్రాణుల రక్షణపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- మోతుగూడెం

జాతీయ వన్య ప్రాణుల వారోత్సవాల్లో భాగంగా చింతూరు అటవీ డివిజన్ పరిధి, లక్కవరం రేంజ్‌లోని లక్కవరం, తులసిపాక గ్రామాల్లో లక్కవరం అటవీ క్షేత్రాధికారి వెంకట నానాజీ ఆధ్వర్యంలో శనివారం అటవీశాఖ సిబ్బంది, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. 'వన్య ప్రాణుల రక్షణ అందరి బాధ్యత', 'వన్యప్రాణులను సంరక్షిద్దాం', 'వన్యప్రాణులను వేటాడరాదు', 'వన్య ప్రాణులను వేటాడటం నేరం' 'అడవులను రక్షిద్దాం వన్య ప్రాణులను కాపాడుకుందాం' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వెంకటనానాజీ మాట్లాడుతూ అడవులు, వన్యప్రాణులను కాపాడటం వలన భూ సమతుల్యతను కాపాడవచ్చని తెలిపారు. అడవి జంతువులను వేటాడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు వన్యప్రాణుల రక్షణ ఆవశ్యకతను తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అటవీ అధికారులు బి.సరిత, కూర కుమారి, దూలయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆదయ్య, ఉపాధ్యాయులు మల్లురెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

తహశీల్దార్‌కు అప్పగించిన ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:ఒడిశా రాష్ట్రానికి చెందిన జోలాపుట్టు వ్యాపారి మామిడి భక్తుల సంతోష్ అక్రమంగా 18 బస్తాలు బొలెరో వాహనంలో తరలిస్తుండగా ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు గాసిరామ్ దొర, లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాథ్ పట్టుకున్నారు. విషయం తెలుసుకున్న నాయకులు వనభసింగి పంచాయతీ పరిధి కొత్తూరు గ్రామ జంక్షన్ వద్దకు చేరుకొని అక్రమంగా తరలిస్తున్న కోటా బియ్యాన్ని పట్టుకుని తహసిల్దార్ నరసమ్మకు అప్పగించారు. కేసును నమోదు చేస్తామని తహసిల్దార్ నర్సమ్మ వెల్లడించారు. జోలాపుట్టు గ్రామ వ్యాపారిపై కేసు నమోదు చేసి విచారణ పూర్తిస్థాయిలో జరపలేదని గిరిజన సంఘం మండల కమిటీ సభ్యుడు గాసిరందొర, మండల వైస్ ఎంపీపీ పాటుబోయి సత్యనారాయణ తెలిపారు.

ఈ విషయంపై జిసిసి మేనేజర్ మోహన్ రావును వివరణ కోరగా విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామని ఆయన తెలిపారు.

పట్టుబడిన రేషన్ బియ్యం

మాట్లాడుతున్న ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ బి ప్రవీర్

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి రంపచోడవరం

మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన రంపచోడవరం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. వివిధ రకాల చట్టాలపై ఆ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా యాంటీ ర్యాగింగ్, పోక్సో చట్టం, సమాచార హక్కు చట్టం, ఉచిత న్యాయ సహాయం, లోక్ అదాలత్, దిశ చట్టం, లోకాయుక్త, ఎన్‌డిపిఎస్ తదితర వాటిపై తెలియజేశారు. విద్యార్థులు మంచి నడవడికతో చదువుకొని గమ్యం చేసుకోవాలని సూచించారు. అనంతరం బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు.ఈ కార్యక్రమంలో ఫస్ట్ క్లాస్ జుడిషియల్ మేజిస్ట్రేట్, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బి.ప్రవీర్, న్యాయవాది సిహెచ్.సంతోష్ కుమార్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బాలకష్ణ

కార్యకర్తలు కష్టించి పనిచేయాలి

కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలకృష్ణ

ప్రజాశక్తి -హుకుంపేట:కార్యకర్తలు అందరూ సైనికులుగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు సమ్మరెడ్డి బాలకష్ణ అన్నారు. శనివారం ఆయన నివాసంలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం ఆ పార్టీ మండల అధ్యక్షులు బి.కొండబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన పలువురికి కండువాలు కప్పి పార్టీలోకి బాలకృష్ణ ఆహ్వానించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు సమ్మరెడ్డి బాలకృష్ణ మీడియాతో మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మనమందరం కృషి చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో సామాన్య ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. పెట్రోలు, గ్యాస్ ధర పెంపుతో అవస్థలు పడుతున్నారన్నారు. ప్రతి గ్రామానికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ విధానాలు, ఆశయాలు, మేనిఫెస్టోపై ప్రజలకు తెలియ జేయాలన్నారు. ప్రజలందరూ కాంగ్రెస్ వైపు చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అరకు నాయకులు నోగెల. చంద్రకళ, స్థానిక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జన్ని అప్పారావు, యూత్ కాంగ్రెస్ నాయకులు కోటి, ఏస్ బాలక్రిష్ణ, బురిడీ డేవిడ్, తదితరులు పాల్గొన్నారు...

సమస్యలపై పోరాటానికి సిద్ధంకండి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

ప్రజాశక్తి - అడ్డతీగల

వివిధ రంగాల కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ పిలుపునిచ్చారు. స్థానిక వినాయక తాపీ పనివారుల సంక్షేమ సంఘం కార్యాలయంలో శనివారం జరిగిన సిఐటియు సమావేశంలో వెంకట్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని రకాల కార్మికులకు రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందన్నారు. గడిచిన నాలుగున్నరేళ్ల కాలంలో కార్మికుల సంక్షేమాన్ని పూర్తిగా గాలికొదిలేసిందన్నారు. అంగన్వాడీలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కంటే అదనంగా వేతనం పెంచుతానని, ఆశాలకు, మధ్యాహ్నం భోజనం కార్మికులకు, శానిటేషన్ వర్కర్లకు, వివోఏలకు శ్రమకు తగిన వేతనం ఇస్తానని గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదని పేర్కొన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు అందాల్సిన సంక్షేమాన్ని ఆపేసి బోర్డులో నిధులను ప్రభుత్వం దారి మళ్లించిందని విమర్శించారు. ఇసుక మీద అనేక ఆంక్షలు పెట్టి భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకుండా చేసిందన్నారు. సమస్యలను పరిష్కరించాలని శాంతియుతంగా ఆందోళన కార్యక్రమాలు చేపడితే పోలీసుల ద్వారా నిర్బంధాలు ప్రయోగించిందని పేర్కొన్నారు. రానున్న ఆరు నెలల్లో ప్రభుత్వంతో తాడోపేడో తెలుసుకోవడానికి అన్ని రంగాల కార్మికులు ఐక్యంగా పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, నిర్మల, నాయకులు విజయ, కాసులమ్మ, గోపి, పార్వతి, లింగమణి, జయ, గౌరీ, రాజేశ్వరి, దేవుడమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

25వ రోజుకు టిడిపి రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-రంపచోడవరం

చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ స్థానిక టిడిపి క్యాంపు కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 25వ రోజుకు చేరాయి. ఈ దీక్షల్లో పాల్గొన్న వారికి మాజీ ఎమ్మెల్యేలు సీతంసెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబు రమేష్ పూలమాలలు వేసి దీక్షలను ప్రారంభించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చంద్రబాబును ఇబ్బంది పెట్టే కుట్రలు చేస్తుందని, తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపిందని టిడిపి నేతలు మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కారం సురేష్ బాబు, పాము అర్జున్, మరిచెట్ల వెంకటేశ్వరరావు, పెంటపాటి అనంత మోహన్, మట్ట మెహర్ బాబా గౌడ్, జెఎస్.నగేష్, అడబాల బాపిరాజు, గోర్లే సునీత, వై.నిరంజనిదేవి తదితరులు పాల్గొన్నారు.

దీక్షలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు

అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆటల పోటీల్లో విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - పెదబయలు :స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆటల పోటీల్లో గిరిజన గురుకుల బాలుర స్కూల్‌లో 8 వ తరగతి విద్యార్థి చంటి బాబు ప్రతిభ చాటాడు. పాఠశాల ప్రిన్సిపాల్ శంకర్రావు, వైస్ ప్రిన్సిపాల్ పెళ్లిబోయిని చిట్టిబాబు, ఉపాధ్యాయులు అభినందించారు. మండల, జోనల్ జిల్లా స్థాయిలో ఈనెల 6న జరిగిన క్రీడాలలో పాల్గొన్న చంటి బాబు 400 మీటర్ల పరుగుపందెంలో ఉత్తమ ప్రదర్శన కనబచ్చినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు శిక్షణ ఇచ్చిన పిడి సాగిన గిరిప్రసాద్ పడల్, పిఈటి డి రాంబాబులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

అడుగడుగునా గోతులు..

- రేఖపల్లి-పోచారం రహదారిలో ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని ఆర్ అండ్ బి అధికారులు

ప్రజాశక్తి-విఆర్.పురం

కూనవరం బ్రిడ్జి నుండి రేఖపల్లి మీదుగా పర్యాటక ప్రాంతం పోచారం వెళ్లే ప్రధాన రహదారిలో అడుగడుగునా గోతులు పడ్డాయి. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే ప్రజలు, పర్యాటకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ ఏడాది జులైలో వచ్చిన గోదావరి వరదలకు ముంపు ప్రాంతాల్లో రహదారుల పూర్తిగా దెబ్బతిన్నాయి. కూనవరం బ్రిడ్జి నుండి పోచారం, మండలంలోని మారుమూల కొండ రెడ్ల గ్రామాలకు వెళ్లే ఆర్ అండ్ బి రహదారిలో ఎక్కడికక్కడ పెద్ద పెద్ద గోతులు పడ్డాయి. రాళ్ళు తేలిపోయాయి. దీంతో ఈ మార్గంలో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. కొండ రెడ్ల గ్రామాల ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. అయినా ఆర్ అండ్ బి అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. వరదలు పోయి మూడు నెలలు కావస్తున్నా నేటికీ ఈ రహదారి మరమ్మతులకు నోచుకోలేదు.

పోచారం వద్ద గోదావరిలో లాంచీలు ఎక్కి పాపికొండలు విహారానికి అధిక సంఖ్యలో పర్యాటకులు వెళ్తుంటారు. దీంతో ఈ మార్గం అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు జరుగుతుంటాయి. రహదారిలో ఎక్కడికక్కడ గోతులు పడడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి నిత్యం పర్యాటకులు, కొండరెడ్ల గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిచే ఈ రహదారికి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

శిథిలమైన పోచారం రహదారి

అడుగడుగున ఉన్న గోతులు

కొనసాగుతున్న టిడిపి రిలే దీక్షలు

దీక్ష చేపడుతున్న నేతలు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు నిర్దోషిగా బయటకొస్తారని పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా తెలుగుదేశం పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు సివేరి దొన్నుదొర ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షా శిబిరంలో శనివారం దాసుబాబు పాల్గొని మాట్లాడారు. మచ్చ లేని మనిషి పై రాజకీయ కుట్రలో భాగంగా అవినీతి మరకలు అంటించారని, ఆ విషయాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రజలంతా గమనిస్తున్నారన్నారు.జగన్మోహన్ రెడ్డి ప్రజా ఆదరణ కోల్పోయిన నేపథ్యంలో ప్రజల దారి మళ్లించడం కోసం చంద్రబాబు నాయుడు పై అక్రమంగా కేసులు బనాయించి అరెస్టు చేశారన్నారు.

2024లో జనసేన, టిడిపి కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నాయన్నారు. చంద్రబాబు నాయుడు కు మద్దతుగా నిలుస్తున్న ప్రజలందరికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బూర్జ లక్ష్మి, కొర్ర నీరజ, వార్డ్ మెంబర్ త్రినాధ్, పాడి చందు, రాజు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

నావల్ డాక్‌యార్డు క్యాంటీన్ ఎన్నికల్లో ఐదోసారి ఎన్‌సిఇ జయకేతనం

విజయం సాధించిన ఎన్‌సిఇ ప్యానెల్ అభ్యర్థులకు అభినందన

ప్రజాశక్తి -ములగాడ : నావెల్ డాక్‌యార్డ్‌లో ప్రతిష్టాత్మకంగా జరిగిన క్యాంటీన్ మేనేజింగ్ కమిటీ ఎన్నికల్లో ఎన్‌సిఇ యూనియన్ జయకేతనం ఎగరేసింది. ఈఎన్నికల్లో సిఐటియు, టిఎన్‌టియుసి, డిఐటియు, వైఎన్‌ఆర్‌టియు బలపరిచిన ఎన్‌సిఇ యూనియన్ అభ్యర్థులు మొత్తం ఐదు స్థానాలకు గాను మూడు స్థానాలు గెలిచి వరుసగా ఐదోసారి క్యాంటీన్ కమిటీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్‌సిఇ యూనియన్ ప్రధాన కార్యదర్శి పినపోలేశ్వరరావు మాట్లాడుతూ వరుసగా ఐదోసారి తమ యూనియన్‌ను గెలిపించిన కార్మికులకు ధన్యవాదాలు తెలిపారు. క్యాంటీన్ అభివృద్ధికి మరింత శ్రద్ధతో కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో ఎన్‌సిఇ యూనియన్ నుండి పోటీ చేసిన జి.వి.స్వామి, జి శ్రీనివాసరావు, అంగ నానాజీ గెలుపొందారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి పోటీలలో పాల్గొన్న వాలిలో ఇద్దరు విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక అయినట్లు రాయవరం వ్యాయామోపాధ్యాయుడు కె శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.... స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విశాఖ డిస్ట్రిక్ట్ ఆర్మ్ రిజర్వ్ పోలీస్ గ్రౌండ్‌లో అండర్ 17 విభాగం అథ్లెటిక్ విభాగం రన్నింగ్‌లో ఇద్దరు విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారన్నారు.1500 మీటర్ల రన్నింగ్ విభాగంలో టివిఎన్ దుర్గ, 3000 మీటర్ల విభాగంలో కె.కావ్య ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. ఎంపికయిన ఇద్దరు విద్యార్థినులను ప్రధానోపాధ్యాయుడు యమ్ యస్ సత్యనారాయణ, వ్యాయామోపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు.

పింఛను డబ్బులతో ఉద్యోగి మాయం

ప్రజాశక్తి -గాజువాక : పింఛను లబ్ధిదారులకు పంచాల్సిన డబ్బులతో సచివాలయ వెల్ఫేర్ మాయమైన ఘటన జివిఎంసి 65వ వార్డు సంజీవగిరి కాలనీ సచివాలయంలో చోటు చేసుకుంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించి వివరాలివి.

ప్రతినెలా మాదిరిగానే ఒకటో తేదీన పింఛన్లను లబ్ధిదారులకు పంచే ప్రక్రియలో భాగంగా సంజీవగిరి కాలనీ వెల్ఫేర్ సెక్రటరీ విల్సన్‌కు కూడా యూసిడి అధికారులు డబ్బులు అందజేశారు. రెండు క్లస్టర్లపరిధిలో లబ్ధిదారులకు పంపిణీకి రూ.1,40,500 అందజేయగా, ఇప్పటివరకు సంబంధిత లబ్ధిదారులకు పింఛను సొమ్ము పంపిణీ చేయలేదు. దీనిపై అధికారులకు బాధితులు సమాచారం తెలియజేశారు. విషయం తెలిసిన వెంటనే సంబంధిత వెల్ఫేర్ సెక్రటరీ కోసం యుసిడి విభాగం అధికారులు ఆరా తీయగా అందుబాటులో లేకపోగా, ఫోన్ స్విచ్ఛాఫ్ చేసింది. ఏం జరిగిందో తెలియని పరిస్థితుల్లో దీనిపై పోలీసులకు ఫిర్యాదుచేశారు. కేసు నమోదుచేయాల్సి ఉంది.

జాతీయ స్థాయి చెస్ టోర్నీ విజేతలు అన్ష్ ప్రతీతి

విజేతలతో వైవి.సుబ్బారెడ్డి, ఇతర నేతలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ/ సీతమ్మధార : విశాఖ పోర్టు స్టేడియంలో జరుగుతున్న జాతీయ స్థాయి అండర్-11 చెస్ పోటీలు శనివారంతో ముగిశాయి. బాలుర విభాగంలో 10 పాయింట్లతో అన్ష్ నందన్ (మహారాష్ట్ర), బాలికల విభాగంలో 9.5 పాయింట్లతో ప్రతీతి జయకేతనం ఎగురవేశారు. ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన టిటిడి మాజీ ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, నెడ్ క్యాప్ ఛైర్మన్ కెకె.రాజు, తెలంగాణ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు కెఎస్.ప్రసాద్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఇక టోర్నీ విషయానికొస్తే... 10 పాయింట్లతో అన్ష్ నందన్ (మహారాష్ట్ర), 9 పాయింట్లతో సిద్ధాంత్ పూంజా (కర్ణాటక), ఆదిక్ థియోఫెన్ (కేరళ), సయ్యద్ అబ్బుల్ ఖాదర్ (కర్ణాటక), మయాంక్ మజుందార్ (వెస్ట్ బెంగాల్) మొదటి ఐదు స్థానాల్లో నిలిచి ఛాంపియన్ కైవసం చేసుకున్నారు.

బాలికల విభాగంలో 9.5 పాయింట్లతో ప్రతీతి (కర్ణాటక), 9 పాయింట్లతో సిద్దిరావు (కర్ణాటక), 8.5 పాయింట్లతో పవిత్ర (తమిళనాడు), శరణ్యదేవి (తెలంగాణ), మైషా పరేఖ్ (మహారాష్ట్ర) మొదటి ఐదు స్థానాలు కైవసం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన క్రీడాకారులు బాలుర విభాగంలో 8 పాయింట్లతో శ్రీ అభిరావ్‌సాద్, బాలికల విభాగంలో త్రిపురారిక ఆరో స్థానంలో నిలిచారు. ఈ పోటీల్లో మొదటి, రెండు స్థానాలు సాధించిన వారు 2024లో జరగబోయే ఏషియన్, కామన్వెల్త్, వరల్డ్ చెస్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు, ఆంధ్ర చెస్ అసోసియేషన్ సభ్యులు కెవిఎ.శర్మ, భీమారావు, మణికంఠ తెలిపారు.

గిరిజనులకు అండగా ఉంటా : ఎమ్మెల్సీ రవిబాబు

వైఎస్ఆర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న రవిబాబు

ప్రజాశక్తి- అరకులోయ :గిరిజన ప్రజానీకానికి అన్నివేళలా అండగా ఉంటానని ఎంఎల్‌సి డాక్టర్ కుంభా రవిబాబు అన్నారు. ఎమ్మెల్సీగా ఎన్నికై తొలిసారిగా అరకులోయకు విచ్చేసిన ఆయనకు వైఎస్ఆర్‌సిపి సీనియర్ నాయకుడు పాంగి చిన్నారావు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. గద్య గూడ గ్రామం వద్ద వందలాది మంది స్వాగతం పలికారు. అనంతరం అరకులోయ ముఖద్వారం లోని ఎన్టీఆర్ విగ్రహం నుంచి టౌన్షిప్ మీదుగా టౌన్షిప్ మీదుగా నాలుగు రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాడేరు, రంపచోడవరం, చిత్తూరు, శ్రీశైలం, నల్లమల్ల వంటి ప్రాంతాల్లో పర్యటించి గిరిజనుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేసినట్లు ఆయన అన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేయడంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ముందు ఉండడంతో భారతదేశమే ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తుందని ఆయన అన్నారు.

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ, గిరిజనులకు అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి తమ ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు.

ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి గిరిజనులకు సముచిత స్థానం కల్పించారన్నారు. ట్రైకర్ చైర్మన్ బుల్లిబాబు మాట్లాడుతూ, టిడిపికి ప్రజలు ఓట్లు వేసే పరిస్థితిలో లేరని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ మెంబర్ నర్సింగ్ రావు, అరకు, పాడేరు నియోజకవర్గం లోని వైఎస్ఆర్సిపి నాయకులు జెడ్పిటిసిలు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, రేగం మత్స్యలింగం, కమీడి నీలవేణి , కమ్మడి అశోక్, దురియా ఆనంద్ కుమార్, పల్టా సింగ్ విజయ్ కుమార్, కుర్ర కాసులమ్మ, సమర్ధి రఘునాథ్,శెట్టి అప్పాలు, పెట్టేలి శుక్ర, పెట్టేలి సుస్మిత, సమర్ధి రఘునాథ్, గెడ్డం నర్సింగరావు, సమర్ధి భాస్కరరావు పాల్గొన్నారు

రవిబాబుకి ఘన స్వాగతం

అనంతగిరి:ఎమ్మెల్సీగా ఎన్నికై మండ లానికి విచ్చేసిన ఎమ్మెల్సీ రవిబాబుకు పలువురు నేతలు ఘన స్వాగతం పలికారు. శనివారం ఏజెన్సీ ముఖద్వారం చిలకలగెడ్డ గ్రామ సమీపాన ఉమ్మడి జిల్లా చైర్పర్సన్ సుభద్ర, రాష్ట్ర ఎస్టి కమిషన్ మెంబర్లు కొర్రా. రామలక్ష్మి, తడబారికి లిల్లీ, స్థానిక ఎంపీపీ శెట్టి నిలవేణి, పార్టీ మండల అధ్యక్షులు వేగబోయిన .స్వామిలు స్వాగతం పలికారు.కొత్తమ్మ తల్లి గుడిలో పూజల అనంతరం కాశిపట్నం పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్షకు వెళ్లారు. సర్పంచుల ఫోరం అధ్యక్షులు పాగి అప్పారావు, మండల వైకాపా పార్టీ కోఆప్షన్ సభ్యుడు మదీనా పాల్గొన్నారు

కేసుల పరిష్కారంలో మధ్యవర్తిత్వం కీలకం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి గిరిధర్

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి గిరిధర్

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : కేసుల పరిష్కారంలో మధ్యవర్తిత్వం కీలకమని, సెక్షన్ 89 సివిల్ ప్రొసీజర్ కోడ్ ప్రకారం కేసులు రాజీ చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా అధ్యక్షుడు ఆలపాటి గిరిధర్ అన్నారు. శనివారం రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలతో జిల్లాలోని న్యాయాధికారులు, న్యాయవాదులకు మధ్యవర్తిత్వంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కేసులు పరిష్కరించకోకుంటే పర్యావసానాలను వివరించారు. ఆరవ అదనపు న్యాయమూర్తి సువర్ణరాజు మధ్యవర్తిత్వ చట్టంలోని వివిధ అంశాలను వివరించారు.

జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి,రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.వెంకటరమణ, సిబిఐ కోర్టు న్యాయమూర్తి సిఎన్.మూర్తి మధ్యవర్తిత్వ చట్టంలోని వివిధ అంశాలపై మాట్లాడారు. కమర్షియల్ కోర్టు న్యాయమూర్తి కేశవాచార్యులు కమర్షియల్ కేసుల్లో మధ్యవర్తిత్వ ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తులు, సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిలు, మెజిస్ట్రేట్‌లు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, బార్ కౌన్సిల్ ప్రతినిధి కృష్ణమోహన్ పాల్గొనగా, అనకాపల్లి, అల్లూరి జిల్లాల న్యాయమూర్తులు ఆన్‌లైన్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

సముద్ర పరిశోధనలపై 'గీతం'లో సదస్సు

సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కృష్ణ

ప్రజాశక్తి - మధురవాడ: సముద్ర వనరులు, ఆక్వాకల్చర్ రంగంలో పరిశోధనలు, వ్యాపార అవకాశాలపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ సైన్స్ బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ, సెంట్రల్ ఫిషరీస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీ ఇనిస్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యాన గీతంలో నిర్వహించిన సదస్సుకు అధ్యక్షత వహించిన శాంతి సవ్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కృష్ణ మాట్లాడుతూ గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ లో 31 మంది పరిశోధకులు సముద్ర సంబంధ పరిశోధనలో నిమగ్నమై ఉన్నారన్నారు. బయో ఫ్యూయల్స్, బయో రెమిడీయేషన్, వేస్ట్ మేనేజ్మెంట్, సముద్రాల నుంచి ఔషధాల తయారీ వంటి పరిశోధనలు గీతం వర్సిటీలో జరుగుతున్నాయని, కేంద్ర పరిశోధనా సంస్థలతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామనివెల్లడించారు.

సెంట్రల్ ఫిషరీస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ యు.శ్రీధర్, డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ, ఆక్వా కల్చర్ రంగంలో అభివృద్ధి చేసిన నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వివరించారు. ఇటీవల కాలంలో సముద్ర రంగంపై తాము జరిపిన పరిశోధనలు, దీనికి సంబంధించి ఉన్న అవకాశాలను వెల్లడించారు.

నేషనల్ ఇపిస్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ డైరక్టర్ డాక్టర్ వివిఎస్.శర్మ, సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ దామోదర్ బెల్లి షెనాయ్, డాక్టర్ జగదీష్ లోకనాధం, డాక్టర్ టిఎన్ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ,సముద్ర అధ్యయనాల ప్రాధాన్యతను వివరించారు.గీతం స్కూల్ సైన్స్ మైక్రో బయాలజీ, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం సీనియర్ ప్రొఫెసర్ ఆర్ జ్ఞానప్రసూన, డాక్టర్ సమత బ్రాంచ్ గోపాల్, డాక్టర్ గార్గి గోస్వామి తాము చేస్తున్న పరిశోధనలు వివరించారు. గీతం రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డైరెక్టర్ డాక్టర్ రాజాఫణిపప్పు, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వేదవతి, బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ ఎం.అనిత పాల్గొన్నారు.

విశాఖకు ఇ - బస్సులు

200 కేటాయింపు, మార్చిలోగా 100 వచ్చే అవకాశం

సింహాచలంలో ప్రత్యేక డిపో నిర్మాణానికి ఆర్‌టిసి కసరత్తు

ప్రజాశక్తి - గ్రేటర విశాఖ బ్యూరో

ప్రజా రవాణా వ్యవస్థలో మార్పులు దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా వాయు, శబ్ద కాలుష్యంతో బావితరాలు అవస్థలు పడకుండా ఉండే దిశగా ఎకో - వెహికల్ పాలసీని తీసుకుంటోంది. ఇ-బస్సులను రాష్ట్రంలోని కొన్ని ముఖ్య పట్టణాలు, నగరాల్లో రోడ్లపై తిప్పేందుకు రంగం సిద్ధమవుతోంది.



దీంట్లో భాగంగా 2025 మార్చిలోగా విశాఖ, తిరుపతి, నెల్లూరు, విజయవాడ వంటి చోట్ల కొన్ని విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయని ఆర్‌టిసి ఉన్నతాధికారులు వెల్లడిస్తున్నారు. విశాఖపట్నం ప్రజారవాణా శాఖ అధికారి ఎ.అప్పలరాజు 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ విశాఖ జిల్లాకు 200 బస్సుల కేటాయింపు ఉందని, 2024 డిసెంబర్‌లోగా అది సాకారం అవుతుందని అన్నారు.

ఈ నేపథ్యంలో 2024 మార్చిలోగా విశాఖకు 100 బస్సులైనా వచ్చే అవకాశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. తిరుమల ఘాట్‌రోడ్డులో ఇప్పటికే విద్యుత్ బస్సులను ప్రభుత్వం ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఆ తరువాత విశాఖపైనే దృష్టిపెట్టినట్లు సమాచారం. విద్యుత్ బస్సులకు విశాఖలోని సింహాచలం సమీపాన ప్రత్యేక డిపో నిర్మాణానికి కూడా రాష్ట్ర ప్రజా రవాణా సంస్థ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు స్పష్టమవుతోంది. ఈ స్థలాన్ని ఇదివరకే ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు కూడా పరిశీలించారు.

ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పెద్ద సమస్యే ?

విశాఖలో విద్యుత్ స్కూటర్లు, కార్లు గణనీయంగానే తిరుగుతున్నాయి. వీటికి ఛార్జింగ్ స్టేషన్ల సమస్య వెంటాడుతోంది. ప్రజా రవాణా వ్యవస్థలో ఇలాంటి మార్పు తీసుకొచ్చే ముందు మౌలిక వసతుల పరిస్థితి అత్యంత కీలకంగా మారనుంది. ఇ-బస్సులకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నప్పటికీ అందుకు సంబంధించిన 'ఎలక్ట్రికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్'ను కూడా సమకూర్చుకోవాల్సి ఉంది. దీనికి రూ.లక్షలు ఖర్చుకానుంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రజారవాణా సంస్థలో 10 నుంచి 15 ఏళ్ల సర్వీసు దాటిన పలు బస్సులున్నాయి. వీటి వల్ల కాలుష్యం మరింత వేగంగా విస్తరిస్తోంది. కాలుష్య రహిత విద్యుత్ బస్సుల ప్రవేశం అనేది అవశ్యంగా మారింది. విద్యుత్ బస్సుల కొనుగోలుకు సైతం రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఏళ్లుగడచిన బస్సులను డిపోల్లోనే తుక్కుగా మార్చే ప్రక్రియకు ప్రభుత్వం ఓకే చెప్పినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే విద్యుత్ బస్సుల డిమాండ్, ఉత్పత్తి అంచనాలపై నివేదికలు సిద్ధమవుతున్నాయి. 15 ఏళ్ల సర్వీసు దాటిన బస్సుల వివరాలను రాష్ట్రంలోని డిపోల వారీగా అధికారులు సేకరిస్తున్నారు. విద్యుత్ బస్సులను అధిక వ్యయం వెచ్చించి కొనుగోలు చేయడం, నడపడంతో ప్రయాణికులపై ఆ మేరకు ఛార్జీల భారం పడనుంది.

ఆశా కార్యకర్తల నిరసన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:ఆశా కార్యకర్త మృతికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని సిఐటియు డిమాండ్ చేసింది. శనివారం మండలంలో వేములపూడి పీహెచ్‌సీ వద్ద ఆశ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తల యూనియన్ సభ్యులు మాట్లాడుతూ, గుంటూరు జిల్లా తాడేపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో విదులు నిర్వహిస్తూ తీవ్ర ఒత్తిడి కారణంగా అకస్మాత్తుగా రేపూడి కృపమ్మ మృతి చెందిందని, దీనికి ప్రభుత్వమే పూర్తి భాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. అ కుటుంబానికి 50లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తల అమ్మాజి, నాగమణి, లక్ష్మీ కాంతం, లక్ష్మీ పాల్గొన్నారు.

రాజుకు డాక్టరేట్

ప్రజాశక్తి -పాయకరావుపేట:మండలంలోని అరట్ల కోట గ్రామానికి చెందిన పరిశోధక విద్యార్థి బొడ్డపాటి రాజుకి ఆంధ్ర యూనివర్సిటీ విద్యా విభాగంలో డాక్టరేట్ లభించింది. విభాగ అధిపతి డాక్టర్ టి. షారోన్ రాజు పర్యవేక్షణలో ఎ స్టడీ ఆన్ క్వాలిటీ ఎడ్యుకేషన్ ఇన్ సెకండరీ స్కూల్స్ ఇన్ విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్" అనే అంశం మీద పరిశోధన చేసినందుకు గాను రాజుకు ఆంధ్ర యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్. పి. వి. జి. డి. ప్రసాద్ రెడ్డి శనివారం అయన ఛాంబర్ లో డాక్టరేట్ పట్టాను అందజేశారు. ఈ సందర్భంగా గైడ్ డాక్టర్ టి. షారోన్ రాజు, విభాగం ఆచార్యులు, పరిశోధకులు రాజుకు అభినందనలు తెలియజేశారు.

ఉపాధి హామీ పనులపై గ్రామసభ

గ్రామసభలో మాట్లాడుతున్న ఎపిఒ

ప్రజాశక్తి - విఆర్.పురం : 2023-24 ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టనున్న పనులపైనా, గ్రామ పంచయతీల్లో అభివృద్ధి పనుల నిర్వహణపైనా శనివారం మండలంలోని రాజుపేట గ్రామ సచివాలయంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ వడ్డానపు శారద అధ్యక్షతన జరిగిన ఈ గ్రామసభలో ఎన్ఆర్ఇజిఎస్ ఎపిఒ పి.రాఘవయ్య మాట్లాడుతూ ఈ ఏడాది ఉపాధి హామీ పథకం కింద ఏ పనులు చేయాలో వివారించారు. జాబ్ కార్డుకు, బ్యాంక్ ఖాతా ఆధార్ లింక్ తప్పని సరిగా చేయాలని సూచించారు. పని అడిగిన ప్రతి కుటుంబానికీ 100 రోజులు పని కల్పిస్తామన్నారు. సచివాలయ కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్థిక సంఘం నిధులతో గ్రామంలో మౌలిక సౌకర్యాలు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టడానికి వార్డు సభ్యులతో చర్చించి తీర్మానాలు చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ గ్రామసభలో వార్డు సభ్యులు, వ్యవసాయ శాఖ సిబ్బంది నాగు, టెక్నికల్ అసిస్టెంట్ సుగ్గిరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ బొర్రా సాయి, సచివాలయ సిబ్బంది హారీస్ తదితరులు పాల్గొన్నారు.

ముసురుమిల్లిలో...

రంపచోడవరం : మండలంలోని ముసురుమిల్లి పంచాయతీలో సర్పంచ్ కోసు రమేష్ బాబు అధ్యక్షతన శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యులు వంశి కుంజం మాట్లాడుతూ గత గ్రామసభలో చెప్పిన సమస్యలు చాలా వరకు పూర్తి చేసినట్లు చెప్పారు. ఉపాధి హామీ ద్వారా రైతులకు ఉపయోగకరమైన పనులు గుర్తించి చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, వార్డు సభ్యులు ప్రభావతి, సరస్వతి, రామలక్ష్మి, సచివాలయం కన్వీనర్ బొబ్బా శేఖర్, రాజన్నదొర, పంచాయతీ కార్యదర్శి రాంబాబు, ఎపిఒ సత్యనారాయణ, టెక్నికల్ అసిస్టెంట్ శేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సిపిఎస్ రద్దు చేసే వరకూ పోరాటం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలలను శనివారం ఏపిటిఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటపతి రాజు, జిల్లా ఉపాధ్యక్షులు అప్పారావు, జిల్లా కార్యదర్శి అర్.ప్రకాశరావు సందర్శించారు. ఈ సందర్భంగా వెంకటపతిరాజు మాట్లాడుతూ, ఉపాధ్యాయుల పట్ల ముఖ్య కార్యదర్శి వ్యవహరిస్తున్న తీరును ఖండిస్తున్నా మన్నారు. ఉపాధ్యాయులు ఒక యంత్రంలా పనిచేస్తున్నారన్నారు. మూడు నెలలుగా జీతాలు లేవని, దీనికి ఎవరు బాధ్యత తీసుకుంటారని ప్రశ్నించారు. సిపిఎస్ రద్దు చేసే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షులు నరసింహమూర్తి, ప్రధాన కార్యదర్శి బ్రహ్మం, రమణ పాల్గొన్నారు.

21న జాతీయ లోక్ అదాలత్

మాట్లాడుతున్న న్యాయమూర్తి షణ్ముఖరావు

ప్రజాశక్తి -గాజువాక: ఈనెల 21న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని 13వ జిల్లా జడ్జి షణ్ముఖరావు కోరారు. శనివారం గాజువాక కోర్టు కాంప్లెక్స్ ఆవరణలో సమావేశంలో మాట్లాడుతూ, జాతీయ లోక్ అదాలత్‌లో ఇన్సూరెన్స్, రెవెన్యూ ఇతరత్రా కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని సూచించారు. కక్షిదారులు లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కెవి.స్వామి, న్యాయమూర్తులు ఇ. రాజేంద్రబాబు, శ్రీలక్ష్మి , జూనియర్ సివిల్ జడ్జి ప్రేమలత, బార్ అసోసియేషన్ న్యాయవాదులు, ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు, గాజువాక, పెదగంట్యాడ తహశీల్దార్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాలాక్షినగర్, దయాల్‌నగర్‌లో దయాల్‌బాగ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్‌లో వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. డ్రెస్ డిజైనింగ్ అండ్ టైలరింగ్ (స్త్రీలకు), టెక్స్‌టైల్ డిజైనింగ్ అండ్ ప్రింటింగ్, మోటార్ వెహికిల్ మెకానిక్ (ఫోర్ వీలర్స్ అండ్ టూ వీలర్), ఆఫీస్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. డిఇఐ ఇన్ఫర్మేషన్ సెంటర్, దయాల్‌నగర్, విశాలాక్షినగర్, విశాఖపట్నం-43 చిరునామాకు దరఖాస్తులు పంపాలన్నారు. మరిన్ని వివరాల కోసం 9963340611 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

ప్రజాశక్తి - అనకాపల్లి : విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ మీటర్లు పెట్టాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్మార్ట్ మీటర్ల వ్యయాన్ని భవిష్యత్తులో విద్యుత్ ఛార్జీలు పెంచి వినియోగదారుల నుంచి వసూలు చేయనున్నట్టు తెలిపారు. ప్రభుత్వ చర్యలు వల్ల వినియోగదారులపై భారాలు పెరుగుతాయన్నారు. ప్రీ పెయిడ్, పోస్టు పెయిడ్ మీటర్ల ఏర్పాటుతో ఉద్యోగుల సంఖ్య కూడా తగ్గించే అవకాశం ఉందని తెలిపారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించి రానున్న కాలంలో సబ్సిడీ ఎత్తివేయాలన్న ఆలోచనతో ప్రభుత్వం ఉందన్నారు. రాష్ట్రంలో రెండు కోట్ల విద్యుత్ వినియోగదారులకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు పెట్టడానికి టెండర్లు పిలిచారని తెలిపారు. అదానీ తదితర కార్పొరేట్లకు ఈ కాంట్రాక్టును కట్టబెట్టారని పేర్కొన్నారు. మీటర్లు రైతులు, వినియోగదారుల పాలిట ఉరితాళ్లుగా మారనున్నాయన్నారు. ముందుగానే విద్యుత్ బిల్లులు చెల్లించే ప్రీపెయిడ్ విధానం ప్రవేశపెడుతున్నారని తెలిపారు. స్మార్ట్ మీటర్లకయ్యే వేలాది రూపాయలను వినియోగదారులే భరించాల్సి ఉందని, రాత్రిపూట వినియోగించుకునే కరెంటుకు అదనపు బిల్లులు వేసే ప్రమాదకర విధానం తెస్తున్నారని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యుత్ చట్టంలో భాగంగా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. డిస్కామ్‌లను ప్రయివేటీకరించి ప్రయివేటు వ్యక్తులకు అప్పగించాలన్న మోడీ ప్రభుత్వం కుట్రలను తిప్పికొట్టకపోతే వినియోగదారులపై భారాలు పెరుగుతాయని తెలిపారు. విద్యుత్ రంగాన్ని అదానీ, తదితర కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి, కార్పొరేట్లకు పూర్తిగా లొంగిపోయిందని తెలిపారు. గతంలోని ప్రభుత్వాలు అడ్డగోలుగా బడా కంపెనీలతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను సమీక్షిస్తామని మాట ఇచ్చి నేడు వైసిపి అదే బాటలో ప్రయాణించడం దారుణమన్నారు. తక్షణం విద్యుత్ భారాలు తగ్గించి, స్మార్ట్ మీటర్లు పెట్టడం ఆపాలని డిమాండ్ చేశారు. ప్రమాదకరమైన విద్యుత్ సంస్కరణలు రద్దు చేయాలని అన్నారు

జనసేనపై విమర్శలు తగవు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:జనసైనికులను విమర్శిస్తే మరింత ముందుకు దూసుకెళతామని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర అన్నారు. శనివారం ఆయన నర్సీపట్నంలో విలేకరులతో మాట్లాడారు. తాము లేవనెత్తిన సమస్యలపై మాట్లాడకుండా వ్యక్తిగత విమర్శలు చేయించడం స్థానిక ఎమ్మెల్యేకు సరికాదన్నారు.తాను ప్రధానమంత్రి స్కీమ్ కింద రుణం తీసుకొని 50 కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్నానని, ఈ నాలుగేళ్ల కాలంలో ఎస్సీ, ఎస్టీ, బిసి సబ్సిడీ రుణాలు ఒక్కరికైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. ఎన్నో సమస్యలపై తాము ప్రశ్నిస్తున్నామని, దానికి సమాధానం చెప్పకుండా నాయకులతో దుర్భాషలాడటం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం టౌన్ నాయకులు మారిశెట్టి రాజా, మండలాల అధ్యక్షులు గండెం దొరబాబు, వెలగల వెంకటరమణ, నాయకులు సిద్దా సుబ్బారావు, వాసం వెంకటేష్, మురళీ, బద్రి, చినరాజు, వేగిశెట్టి శ్రీను, భీమిరెడ్డి యామేష్, జనసైనికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.